## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలిరూరల్: విద్యుత్ లైన్లు మరమ్మతులు, చెట్ల కొమ్మలు నరకాల్సి ఉండడం, పెదరావూరు ఫీడరు మరమ్మతులు జరుగుతుండడంతో పెదరావూరు ఫీడర్ కిందకు వచ్చే తెనాలి పట్టణంలోని ప్రాంతాలతో పాటు పెందరావూరులో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

### విద్యుత్ మీటర్లను మార్చొద్దు



తెనాలిఅర్బన్: విద్యుత్ మీటర్ల మార్పుతో పేదలు ఎంతగానో నష్టపోనున్నారని, వెంటనే ఆ ప్రక్రియ విరమించాలని సీపీఎం నాయకుడు కొల్లిపర బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సుల్తానాబాద్‌లో సోమవారం విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఛార్జీలను పెంచిన నాటి టీడీపీ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడ్డారని గుర్తు చేశారు. నేటి కూటమి ప్రభుత్వానికి కూడా ఇదే గతి పట్టే అవకాశం ఉందన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు షేక్ హుస్సేన్‌వలీ, జి.వెంకటసుబ్బయ్య, జి.రాంబాబు, కె.శ్రీనివాసరావు, వి.పోతురెడ్డి, పవన్‌రెడ్డి, పి.మురళీకృష్ణారెడ్డి, వి.శ్రీనివాసరావు, డి.రత్నాబాబు, కె.పాపిరెడ్డి, వి.శివారెడ్డి పాల్గొన్నారు.

### కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

తెనాలిఅర్బన్: విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను డెవలప్ చేసుకోవాలని మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు మారీసుపేటలోని ఎన్‌సీఆర్ ఎన్ఎంహెచ్ స్కూల్‌లో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోవ తరగతి తరువాత ఎంచుకునే కోర్సులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ అభిరుచులకు తగినట్లు కోర్సులు ఎంచుకుంటే ప్రయోజనం ఉంటుందని చెప్పారు. కార్యక్రమాన్ని ఏఎల్ఎస్‌సీ శ్రీనివాసరావు పరిశీలించారు. నిఖిత, పూజితలు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. హెచ్ఎం పి.వి.సుధారాణి, పలువురు ఉపాధ్యాయులు, రీసోర్స్‌పర్సన్ సిహెచ్.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

### ఆక్రమణలను తొలగించండి




తెనాలిఅర్బన్: స్థానిక 7వ వార్డులో రోడ్డు పక్కన ఉన్న ఇనుప రేకుల బండి కొట్టుతో పాటు ఆక్రమణలను తొలగించాలని కె.నాగేశ్వరరావు కోరారు. ప్రజ సమస్యల పరిష్కార వేదికను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. 12వ వార్డులో రోడ్డుకు ఇరువైపుల మురుగు కాల్వలు ఏర్పాటు చేయాలని ఎ.ధనసూర్యం కోరారు. వచ్చిన అర్జీలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ దేవసేన, పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

### శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి

తెనాలిఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న కెరీర్ గైడెన్స్ శిక్షణ తరగతులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ విజయలక్ష్మి సూచించారు. ఐతానగర్‌లోని ఎస్ఎస్ఎస్ఎంహెచ్, కెఐఎస్ఎంహెచ్, ఎన్‌సీఆర్, బాయ్స్ హైస్కూల్, గర్ల్స్ హైస్కూల్‌లో సోమవారం జరుగుతున్న కెరియర్ గైడెన్స్ శిక్షణ తరగతులను ఆమె పరిశీలించారు. ఆమె వెంట పలువురు విద్యాశాఖ అధికారులు ఉన్నారు.

### జాతీయ షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపిక



తెనాలి: పశ్చిమబంగ రాష్ట్రంలోని హౌరాలో ఈనెల 27–29 తేదీల్లో జరగనున్న 43వ జూనియర్ జాతీయ షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు స్థానిక వెస్ట్‌బెర్రీ పాఠశాల 12వ తరగతి విద్యార్థి టి.సాయిఏకనాథ్ ఎంపికయ్యాడు. రాష్ట్ర జట్టుకు గుంటూరు జిల్లా నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థి సాయిఏకనాథ్ అని డైరెక్టర్ ఎం.ప్రసన్న, ప్రిన్సిపాల్ టి.సుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని అభినందించారు.

### 30న పోస్టల్ డాక్ అదాలత్

తెనాలిఅర్బన్: రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ వారి ఆదేశాల మేరకు ఈ నెల 30వ తేదీన తెనాలి కొత్తపేటలోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జి.కరుణాకర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తపాలా సేవలకు సంబంధించిన ఫిర్యాదులను అదాలత్‌లో తెలియజేసి పరిష్కారం పొందవచ్చన్నారు.

# ఆకుకూరల సాగు..లాభాలు బాగు

- ఆకుకూరలతో సంపూర్ణ ఆరోగ్యం
- మండలంలో పెరుగుతున్న ఆకు కూరల సాగు
- పుష్కలంగా పోషక విలువలు





కొల్లిపరలో సాగులో ఉన్న చుక్కకూర పంట, (ఇన్‌సెట్) తెనాలి ఏడీఏ ఉషారాణి

కొల్లిపర: చిన్నారులు, యువత, పెద్దలు, వృద్ధులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే తినే ఆహారంలో ఆకుకూరలు తప్పనిసరి. అలాంటి ఆకుకూరల సాగుకు పూర్వీకుల నుంచి ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాలలోని రైతులు, ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపుతారు. తెనాలి నియోజకవర్గంలో తెనాలి, కొల్లిపర మండలంలో సుమారు 20 ఎకరాల్లో తోటకూర, గోంగూర, కొత్తిమీర, చుక్కకూర, మెంతి వంటి వివిధ రకరకాల ఆకుకూరలు రైతులు పంట పొలాల్లో సాగుచేస్తున్నారు. వీరే కాకుండా డ్వాక్రా మహిళలు ఇంటి పెరటి తోటలో సేంద్రియ ఎరువులతో ఆకుకూరలు పండిస్తూ ఉంటారు. రైతులు వాటిని కూరగాయల మార్కెట్, కురగాయల దుకాణాలల్లో అమ్మి ఆర్థికంగా లబ్ధిపొందుతున్నారు. ఆకు కూరల్లో విటమిన్లు, లవణాలు, మాంసకృత్తులు, పీచుపదార్థం మెండుగా ఉంటుందనే విషయం తెలిసిందే. ప్రస్తుత చలికాలంలో ఆకు కూరలు సాగు చేయటానికి అనుకూలమైన వాతావరణమని రైతులు ఆకు కూరల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలని తెనాలి ఏడీఏ ఉషారాణి పలు సూచనలు చేశారు.

**సాగులో సస్యరక్షణ చర్యలు ఇలా......**

ఆకు కూర పంటలకు తక్కువ మందు అవశేషాలు ఉండే పురుగు మందులను మాత్రమే వాడాలి. పేను బంక, ఆకుతినే గొంగళి పురుగుల నివారణకు రెండు మిల్లీలీటర్ల మాలాథియాన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా వేప సంబంధిత పురుగుల మందులను వినియోగించుకోవాలి. ఆకు మచ్చ తెగులు(సర్కోస్పరమచ్చ) నివారణకు మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటరు నీటికి కలపి పిచికారీ చేయాలి. పురుగు మందు పిచికారీ చేసిన తర్వాత కనీసం 10 రోజుల వ్యవధి ఇచ్చి ఆకుకూరలు కోయాలి.

**నేల తయారీ ఎరువులు ఇలా.....**

ముఖ్యంగా ఆకుకూరల సాగు విషయంలో నేల తయారీ చాల ముఖ్యం. పొలంలో మెత్తటి దుక్కు వచ్చే వరకు లోతు దుక్కితో పాటు 3.4సార్లు సాధారణ దుక్కి చేయాలి. ఆఖరి దుక్కిలో ఎకరానికి 10టన్నుల పశువుల పెంట, 350 కిలోల వేప పిండి, 90 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 11 కిలోల జింక్ సల్ఫేట్, రెండు కిలోల గ్రాన్యుబోర్, 100 కిలోల శుద్ధి చేసిన ట్రైకోడెర్మా, 25కిలోల యూరియా , 25కిలోల పొటాష్ వేయాలి.తర్వాత నేలలో మట్టి పెళ్లలు లేకుండా చదును చేసుకుని ఆకుకూరలు విత్తుకోవాలి.

# 27న విద్యుత్ చార్జీల పెంపుపై 'పోరుబాట'



పోస్టర్‌ను ఆవిష్కరించిన తాడిబోయిన రాధిక. పక్కన పార్టీ నేతలు

తెనాలి: కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక చర్యలను నిరసిస్తూ ఈ నెల 27వ తేదీన విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా కార్యక్రమం 'పోరుబాట'ను జయప్రదం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కల్లం వెంకటప్పారెడ్డి కోరారు. స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో సోమవారం పోరుబాటకు సంబంధించిన పోస్టర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆవిష్కరించారు. కార్యక్రమంలో కల్లం వెంకటప్పారెడ్డి మాట్లాడుతూ, కరెంటు ఛార్జీలను తగ్గిస్తామని, పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆర్నెల్లలోపే కరెంటు ఛార్జీలను పెంచటం ప్రజలను మోసగించటమేనని అన్నారు. డిస్కమ్‌ల పేరుతో విద్యుత్ ఛార్జీలను ఇబ్బడిముబ్బడిగా పెంచుతూ ప్రభుత్వం రాష్ట ప్రజలపై వేలాది కోట్ల రూపాయల భారాన్ని మోపుతోందని గుర్తుచేశారు. కరెంటు ఛార్జీల పెంపుదలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతి ఒక్కరూ సన్నద్ధులై ధర్నా కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ ఎన్నికల్లో అలవికాని హామీలను ఇచ్చిన కూటమి నేతలు తీరా అధికారంలోకి వచ్చాక సూపర్‌సిక్స్ హామీలను పట్టించుకోవటం లేదని గుర్తుచేశారు. నిత్యావసరాల ధరలు రోజురోజుకీ పెరుగుతూ ప్రజలకు భారంగా మారిన తరుణంలో కరెంటు ఛార్జీల పెంపుదల దారుణమన్నారు. గృహవినియోదారులపై మోపిన రూ.15,485.36 కోట్ల ఛార్జీల బాదుడును వెంటనే ఉపసంహరించుకోవాలనీ, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి, పార్టీ నాయకులు మన్నవ శాంత కుమారి, కావేటి నిర్మల, కొమ్ము రాయల్, అక్కిదాసు కిరణ్ కుమార్, కుర్రా శ్రీను, యలవర్తి సాంబశివరావు, వేముల మహేష్, బాలరాజు పాల్గొన్నారు.

# సేంద్రియ వ్యవసాయం రైతులకు లాభం



రైతులకు కిట్లు అందజేస్తున్న హెచ్ఆర్ మేనేజర్ సునీత, గౌతమ్‌రెడ్డి

మున్నంగి(కొల్లిపర): నేటి సమాజంలో సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో రైతులు పంటలు పండించటం వలన ఆరోగ్యంతో పాటు అధికలాభాలు ఆర్జించవచ్చని డి.హెచ్ఏఏటీ సుగంధ ద్రవ్యాల కొనుగోలు సంస్థ హెచ్ఆర్ మేనేజర్ సునీత అన్నారు. రైతుల దినోత్సవం సందర్భంగా డి.హెచ్ఏఏటీ సుగంధ ద్రవ్యాల కొనుగోలు సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని మున్నంగి గ్రామంలో పసుపు, మిరప రైతులకు సేంద్రియ వ్యవసాయం, పండిన పంటలు ఏవిధంగా మార్కెట్‌లో అమ్ముకోవాలి అన్న అంశాలపై అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. లిట్‌విన్ ట్రేడ్స్ కంపెనీ వంగా గౌతమ్‌రెడ్డి రైతులకు పలు సూచనలు అందజేసి, కిట్లులను అందించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్ఏఏటీ సుగంధ ద్రవ్యాల కొనుగోలు సంస్థ సభ్యులు రవిశంకర్, వెంకటరమణ, సురేష్ కృష్ణా, రైతులు ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఆరిగ దిలీప్‌రెడ్డి, కోడూరు శ్రీను, రైతులు పాల్గొన్నారు.

# 'తెల్లాకుల'కు ఘన నివాళి



వెంకటేశ్వర గుప్తాకు హరికథా గానంతో నివాళులర్పిస్తున్న శిష్యులు

తెనాలిరూరల్: పట్టణానికి చెందిన హరికథ మరియు బుర్రకథ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యా దానకర్త, యక్షగాన కళానిధి, హరికథాచార్య తెల్లాకుల వెంకటేశ్వర గుప్తా భాగవతార్ 113వ జయంతి మహోత్సవాలు, మధుర గాయని మామిడి సరస్వతి భాగవతారిణి సంస్మరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. స్థానిక మారిస్‌పేటలోని శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి కళ్యాణ మండపంలో ఉదయం నుండి రాత్రి వరకు జరిగిన కార్యక్రమాల్లో వెంకటేశ్వర గుప్త కుటుంబ సభ్యులు, తెలుగు రాష్ట్రాల్లోని ఆయన శిష్యులు పాల్గొని, గుప్తా, ఆయన కుమార్తె చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉభయ తెలుగురాష్ట్రాల్లోనూ పేరెన్నిక గన్న గుప్తా శిష్య బృందం హరికథ గానం చేశారు. ప్రముఖ హరికథకులు బి.లక్ష్మీనారాయణ, మొగలిచర్ల నాగమణి, సిహెచ్.ఆంజనేయరాజు, కె.శారద ఎస్.వేదవతి, విన్నకోట రామకుమారి, ఎం.సింహాచలశాస్త్రి భాగవతుల హరికథాగానంతో ప్రేక్షకులను విశేషంగా అలరించారు. రాత్రికి నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్, తెనాలి పట్టణ కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి, కోట అక్కేశ్వర రావు, కన్నెగంటి మురళీకృష్ణ, నన్నపనేని రాంబాబు, సీహెచ్ విద్యావతి పాల్గొని వెంకటేశ్వర గుప్తా కళామతల్లికి అందించిన సేవలను గుర్తు చేశారు. ప్రముఖ మృదంగ, వయోలిన్, తబల, హార్మోనిస్ట్, డోలక్, ఫ్లూట్ విద్వాంసులు మోదుకూరి నగధరరావు, పాణ్యం దక్షిణామూర్తి, ఎ. లక్ష్మీనారాయణ, సింహాద్రి నాగేంద్రప్రసాద్, టీవీ కృష్ణ, చావలి శ్రీనివాస్, చింత ఈశ్వర్ శర్మ, సీతాపతిరావు, ఎం. కేశవరావు, కుమార్ బాబు వాయిద్య కళాకారులుగా సహకారం అందించారు.

# పూర్వవిద్యార్థిని మహాలక్ష్మికి ఘనసత్కారం



బీఎస్ఎఫ్ జవానుగా ఎంపికైన మహాలక్ష్మిని సత్కరించిన బాలయ్య, ఉపాధ్యాయులు

తెనాలి: సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్)లో చేరిన తెనాలి యువతి ఎద్దు మహాలక్ష్మిని సోమవారం ఆమె చదువుకున్న అయితానగర్‌లోని ఎన్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలులో ఘనంగా సత్కరించారు. హెచ్ఎం సునీత ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశానికి మండల విద్యాశాఖాధికారి–2 జయంత్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హైస్కూలులో చదువుకుని, ఎన్‌సీసీలో ఏ సర్టిఫికెట్‌ను సాధించిన మహాలక్ష్మి ధైర్యసాహసాలతో బీఎస్ఎఫ్‌లో చేరారని, విద్యార్థులు తనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మహాలక్ష్మి మాట్లాడుతూ హైస్కూలులో చదువు తనకు ఆటపాటల్లో ఎన్‌సీసీలో రాణించేందుకు దోహదపడిందని చెప్పారు. ఎన్‌సీసీ అధికారులు ఎన్.అనసూయ, బెల్లంకొండ వెంకట్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. రన్నింగ్, ఇతర అథ్లెట్స్‌లో తనను ప్రోత్సహించిన భాస్కర్, ప్రత్యేకంగా శిక్షణనిచ్చి ఈ స్థాయిలో నిలిచేందుకు తోడ్పడిన కోచ్ బాలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల విద్యాకమిటి చైర్మన్ కిరణ్, ప్రసూనాదేవి తదితరులు మహాలక్ష్మిని ఘనంగా సత్కరించారు.

# ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోండి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ తులసీ, సుధాకర్, తదితరులు

తెనాలిఅర్బన్: విద్యార్థి దశలోనే ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా అందరూ కృషి చేయాలని అమృత ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ డాక్టర్ తులసీ పేర్కొన్నారు. ఎన్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక విద్యకు ఎక్కువ అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. అందరూ వాటిని అందిపుచ్చుకుంటూ ముందుకు సాగాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ వీబీఎన్.అజయ్, వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్ర, పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని తిప్పికొట్టాలి

తెనాలి: వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం పేరుతో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దొడ్డిదారిన మూడు నల్లచట్టాలను తీసుకొస్తోందని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. రైతులు, రైతుసంఘాలు దీనిని వ్యతిరేకించాలని సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తిచేశారు. రైతులు ఎప్పట్నుంచో పోరాడుతున్న కనీస మద్దతు ధరల చట్టం ఈ ముసాయిదా చట్టంలో లేదన్నారు. రైతులకు బేరసారాలాడే శక్తిని తగ్గించటంవల్ల రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న వ్యవసాయ మార్కెట్‌లు ప్రైవేటుపరం అవుతాయని తెలిపారు. దేశవ్యాప్తంగా రైతుసంఘాలతో చర్చించకుండా మోదీ ప్రభుత్వం తీసుకురాబోతున్న వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని తిప్పికొట్టాలని కోరారు.

# క్రీస్తు సందేశం మానవాళికి ఆదర్శం

**సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే శివకుమార్**



సెమీ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేసిన మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటైన వేడుకల్లో పార్టీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక చేతుల మీదుగా క్రిస్మస్ కేకును కట్ చేశారు. పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.మాజీ ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ, లోక రక్షణ కోసం ప్రభువైన ఏసుక్రీస్తు జన్మించిన సందర్భంగా జరుపుకునే వేడుకల్లో, ప్రతిఒక్కరు ఆయన బోధనలను అనుసరించాలన్నారు. ఆయన బోధనలు మానవాళికి ఆదర్శంగా చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరు సంతోషంగా క్రిస్మస్ పండుగను జరుపుకోవాలన్నారు. ఈ వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత తెనాలి యునైటెడ్ టౌన్ పాస్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి రెవరెండ్ పల్లె శామ్యూల్, కో–ఆర్డినేటర్లు బ్రదర్ ఆనందన్న, రెవరెండ్ ఎన్.చిట్టిబాబు, బ్రదర్ ఆబ్రహాము రెడ్డిబోయిన, రెవరెండ్ ఎం.స్టీఫెన్, తెనాలి టౌన్‌చర్చి పాస్టర్ లెనిన్‌లు శివకుమార్‌ను ఆశీస్సులు అందచేశారు.

**క్రీస్తు ప్రేమతత్వాన్ని అందరికీ చాటాలి**

తెనాలిఅర్బన్: ఏసుక్రీస్తు బోధించిన ప్రేమతత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవార్చుకోవాలని నిత్యసహాయ మాత చర్చి ఫాదర్ స్లీవా పేర్కొన్నారు. చినరావూరులోని సెయింట్ జోసఫ్స్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను కరస్పాండెంట్ వేమూరి లూకానందకుమార్, ఫాదర్ స్లీవాలు కట్ చేసి అందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీస్తు పుట్టుక నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం బిల్పి, కళాశాల నిర్వాహకులు వేమూరి కావ్యకుమారి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– ఐతానగర్ జయప్రకాష్‌నగర్‌లోని మైకా చర్చి ఆవరణలో సెమిక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మైకా మినిస్ట్రీస్ అధ్యక్షురాలు పాముల రవికుమారి మాట్లాడుతూ ఏసుక్రీస్తు పాపుల రక్షకుడిగా జన్మించారని తెలిపారు. అనంతరం క్రీస్తు పుట్టుక నాటికను చిన్నారులు ప్రదర్శించారు. అక్కడ ఏర్పాటుచేసిన కేక్‌ను వారు కట్ చేశారు. అనూష, అక్కిదాసు కిరణ్‌కుమార్, డాక్టర్ పాముల జస్టిస్, రిచర్డ్, అనిల్, సునీల్, పాముల ప్రసంగి, రూజ్‌వెల్ట్, స్వర్ణలత, మాధురి, సునీల్, సల్మాన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

– చిల్డ్రన్స్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరానగర్ కాలనీలో ఆదివారం రాత్రి సెమిక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెవరెండ్ ఎ.ఇమ్మానియేల్ ముఖ్యఅతిథిగా పాల్గొని వాక్యపరిచర్య చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన కేక్‌ను గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. గుండపొంగు సాయిరామ్, కాకర్లమూడి చిరంజీవి, గాలిముట్టి రాజ్‌కుమార్, కె.నవీన్, డి.విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మురళి, పాస్టర్ భానుప్రసాద్



రాక్ గాస్పెల్ చర్చిలో క్రిస్మస్ కేక్ కటింగ్

**క్రీస్తు జననం లోకానికి పండుగ**

తెనాలిరూరల్: క్రీస్తు జననం లోకానికి పండుగ అని మంగళగిరికి చెందిన మిషన్ ఆఫ్ జాయ్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు కొదమల జోసఫ్ అన్నారు. పట్టణ మారిస్‌పేటలోని రాక్ గాస్పెల్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జోసఫ్ క్రిస్మస్ సందేశమిస్తూ క్రీస్తును జీవితంలోకి ఆహ్వానించడం ద్వారా సకల శుభాలు కలుగుతాయని చెప్పారు. క్రీస్తు పుట్టుకకు సూచనగా నక్షత్రం కనబడడం ఖగోళ జ్ఞానులు గమనించి ఆయనను దర్శించి స్తుతించేందుకు వచ్చారని తెలిపారు. క్రీస్తును ఆరాధించడమే నిజమైన క్రిస్మస్ అని తెలిపారు. సంఘకాపరి బిషప్ జాన్‌పాల్ పినపాటి మాట్లాడుతూ క్రిస్మస్‌ను సంతోషాల నడుమ జరుపుకోవాలని ప్రతి ఒక్కరు పండుగ సంతోషంలో భాగస్వాములు కావాలని కోరారు. సంఘస్తులందరికీ నూతన వస్త్రాలు అందించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. చర్చి నూతన సంవత్సర క్యాలెండర్‌ను విశ్రాంత డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఉన్నం యెహెజ్కేలు ఆవిష్కరించారు. బిషప్ చిలకా జాన్ వరప్రసాదరావు, పాస్టర్ ఎం. డ్రేక్, గడ్డం జాన్ బాబు ప్రార్థనలు చేశారు. డాక్టర్ శాస్త్రి, చర్చి సంఘ పెద్దలు పినపాటి డేవిడ్‌రాజు, ఆరె దానియేలు, ఈవూరి శ్రీనివాసరావు, ఎస్. జయరాజు, కనుకుర్తి భాస్కరరావు, ఈవూరి ఏసురత్నం, కొలెవరపు ఏసుదాసు, సంఘస్తులు పాల్గొన్నారు.

**నెహ్రూనికేతన్‌లో సెమీ క్రిస్మస్ వేడుక**

తెనాలి: సర్వమానవ సమానత్వాన్ని చాటుతూ స్థానిక బోసురోడ్డులోని నెహ్రూ నికేతన్ పాఠశాలలో సోమవారం సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి అధ్యక్షత వహించారు. సంప్రదాయాలు మరుగున పడుతున్న నేటిరోజుల్లో అన్ని మతాలు అనుసరించే పండుగల విశిష్టతను తెలియజేయాలనే సంకల్పంతో ఆయా వేడుకలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ముఖ్యఅతిథి డాక్టర్ సైమన్‌రాజ మాట్లాడుతూ ఏసుక్రీస్తు పాపులను నీతిమంతులుగా మార్చేందుకు భూమి మీదకు వచ్చారని చెప్పారు.



### ఆర్టీసీ బస్సులో సెమీ క్రిస్మస్



డ్రైవర్‌కు బహుమతి అందజేస్తున్న ప్రయాణికులు

తెనాలిఅర్బన్: వారంతా రాష్ట్ర సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు. ప్రతి రోజు చినరావూరు నుంచి సచివాలయానికి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ ఉంటారు. కులమతాలకు అతీతంగా వీరందరూ సోమవారం ఉదయం ఆర్టీసీ బస్సును అందంగా అలంకరించి సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బస్సులోనే కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకుని డ్రైవర్, కండక్టర్‌కు బహుమతులు అందజేశారు. సురేష్, స్వరూపల ఆధ్వర్యంలో తెనాలి చినరావూరులో జరిగిన వేడుక అందరిలో సంతోషాన్ని నింపింది. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



తెనాలిరూరల్: మండల పరిధిలోని కొలకలూరు ఎస్ఫోర్ హెల్త్ కేర్ సొల్యూషన్స్‌లో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంస్థ ప్రొప్రైటర్ ఎం.సరోజిని అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజరు కె. అమలకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం సండే స్కూల్ నిర్వాహకురాలు ఎం.హోలి నేతృత్వంలో సండే స్కూల్ బాలబాలికలతో క్రీస్తు పుట్టుక నాటికను ప్రదర్శించారు. సంస్థ మార్కెటింగ్ మేనేజర్ ఎం. సంపెంగరావు, పర్సనల్ మేనేజర్ ఎం. రవికుమార్ సభా కార్యక్రమాలను పర్యవేక్షించారు. సిబ్బందికి, చిన్నారులకు విశ్రాంత ఉపాధ్యాయిని ఎస్. విమలమ్మ చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పుత్తూరు ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ ఎం. శేషగిరి, ఏపీటీడబ్ల్యూ రెసిడెన్షియల్ కాలేజీ రసాయన శాస్త్ర అధ్యాపకురాలు నేల జయలక్ష్మి పాల్గొన్నారు.

### క్షేత్రస్థాయిలో అర్జీల పరిశీలన



అర్జీకి సంబంధించిన పొలాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ ఐఏఎస్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

తెనాలిరూరల్: పొలం రిజిస్ట్రేషన్లకు సంబంధించి అనామలీస్ కమిటీకి వచ్చిన అర్జీలను ట్రైనీ ఐఏఎస్, తహసీల్దార్ సోమవారం పరిశలించారు. మండలంలోని నందివెలుగు, అంగలకుదురు గ్రామాల్లో ఇద్దరు వ్యక్తులు తమ పొలాల రిజిస్ట్రేషన్‌పై అనామలీస్ కమిటీకి పిటిషన్ పెట్టుకున్నారు. వీటిని ట్రైనీ ఐఏఎస్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న ధరను వాకబు చేశారు. అలానే చినరావూరులో చర్చికి సంబంధించి గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదును స్వయంగా పరిశీలించారు. అర్జీదారులకు వివరాలు తెలియజేయడంతో పాటు పాత ధరకు రిజిస్ట్రేషన్ కుదురుతుందో లేదో ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని చెప్పారు.